క్లుప్తంగా

అన్న క్యాంటిన్ మరమ్మతులు వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలోని అన్న క్యాంటిన్‌లను వెంటనే మరమ్మతు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో, మున్సిపల్ కార్యాలయం ఎదుట, బస్టాండ్ వెనుక ఉన్న అన్న క్యాంటిన్ భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, పలువురు ఏఈలు ఉన్నారు.

ప్రమాదబీమా చెక్ అందజేత

తాడేపల్లిరూరల్: గాయపడిన జనసేన కార్యకర్తకు ప్రమాద బీమా చెక్కును ఆ పార్టీ మంగళగిరి ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని చిర్రావూరులో కొద్ది రోజుల క్రితం చోటుచేసుకున్న ప్రమాదంలో మక్కే గోపీ గాయపడ్డాడు. ప్రమాద బీమా కింద అధినేత పవన్ కళ్యాణ్ అందజేసిన రూ.50 వేల చెక్‌ను నాయకులు అందించారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులోని ఎంపీయూపీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం మేరిమాత మాట్లాడుతూ క్రీడలు పిల్లల మానసిక వికాసానికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఆటలు ఆడే విధానం, ఆడే క్రమంలో దెబ్బలు తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శశికళ, వరలక్ష్మి, లక్ష్మీకుమారి, శాంతకుమారి పాల్గొన్నారు.

1998 క్వాలిఫైడ్ టీచర్స్‌కు పోస్టింగ్స్ ఇవ్వాలి

మంగళగిరి: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్స్‌కు పోస్టింగ్ ఇవ్వాలని టీచర్స్ అసోసియేషన్ నాయకులు భైరవకోన శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 5,887మంది డీఎస్సీ క్వాలిఫైడ్స్‌కు ఉద్యోగాలు ఇచ్చామని చెప్పి 4,072 పోస్టులు మాత్రమే భర్తీ చేశారన్నారు. మిగిలిపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, వికలాంగులైన 1,815 మందికి అన్యాయం జరిగిందన్నారు. న్యాయం చేయాలని పలుమార్లు కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. ప్రస్తుత మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు సత్వరమే చర్యలు చేపట్టి పోస్టులు భర్తీ చేసి న్యాయం చేయాలని కోరారు.

రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయింపు హర్షణీయం

తాడికొండ: రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్ లో రూ.15 వేల కోట్లు కేటాయించడంపై అమరావతి దళిత బహుజన, రైతు జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా ఉద్దండరాయునిపాలెంలో ప్రధాని రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దళిత బహుజన జేఏసీ కన్వీనర్ చిలకా బసవయ్య, రైతు జేఏసీ నాయకులు జూజాల చలపతిరావు, షేక్ ఖాసీం, బుడే పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఫిరంగిపురం: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డ్వామా పీడీ ఉమాదేవి సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా నుదురుపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని, ప్రభుత్వ పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అన్ని శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో ఓపీని పెంచే దిశగా సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పీహెచ్‌సీ పరిధిలో ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటాలని కోరారు. అనంతరం గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. ప్రజలకు సేవలు అందించే దిశగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ విమాదేవి, సర్పంచి జి.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగలు అరెస్టు

నెహ్రూ నగర్: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి సెల్ ఫోన్లు దొంగలించే ముఠాను ఆర్టీసీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మేకల వెంకటేష్, పసుపులేటి ఏలియా రాజు ఉదయం బస్టాండ్‌లో ప్రయాణికుల వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు దొంగిలించి తిరిగి సాయంత్రం పూట బస్టాండ్‌లో తిరుగుతున్న ఇద్దరిని ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ బి.మునిరెడ్డి, కానిస్టేబుల్ రాజశేఖర్ అదుపులోకి తీసుకొని బస్ స్టేషన్ ప్రాంగణంలోని అవుట్ పోస్ట్ పోలీసులకు అప్పగించారు.

జాషువా రచనలు సమాజానికి మార్గదర్శకాలు

తెనాలి: మహాకవి గుర్రం జాషువా రచనలు నేటి సమాజానికి మార్గదర్శకాలని పలువురు వక్తలు అన్నారు. గుర్రం జాషువా 53వ వర్ధంతి రోజైన బుధవారం పట్టణానికి చెందిన గుర్రం జాషువ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషను సమీపంలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జగ్జీవన్‌రామ్ చైర్‌కు సంచాలకులుగా నియమితులైన డాక్టర్ పొన్నెకంటి రత్నాకర్‌ను సమితి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయునిగా జీవితం ప్రారంభించిన జాషువా సాహితీవేత్తగా ఎదిగి 59 ఖండకావ్యాలు, 14 నటకాలు రాశారని గుర్తుచేశారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు జాషువా చేసిన రచనలు నేటికీ ప్రజాచైతన్యానికి దారులు చూపుతాయని పలువురు ఈ సందర్భంగా చెప్పారు. విజ్ఞాన సమితి బాధ్యులు, వివిధ రంగాల ప్రముఖులు జె.న్యూటన్, పి.రవి కుమార్, కొండముది రమేష్, వి.రత్నం, పి.రాజ గోపాల్, గరికపాటి సుబ్బారావు, షేక్ అబ్దుల్ హకీంజాని, యంగ్రపాటి అశోక్‌కుమార్, కె.సింగయ్య, వి.రాజారత్నం, అయినాల మల్లేశ్వరరావు, కె.దేవయ్య, శరత్‌వెంకయ్య, సుద్దపల్లి మురళీధర్, కె.లక్ష్మణరావు, ఎల్.ప్రసాదరావు పాల్గొన్నారు.

28న గుర్రం జాషువా 53వ వర్ధంతి

పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్, దుగ్గిరాల ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన తెనాలిలోని ఎన్జీవో కళ్యాణ మండపంలో మహాకవి గుర్రం జాషువా 53వ వర్ధంతి, కళాపరిషత్ 36వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. పరిషత్ చైర్మన్ డాక్టర్ పెద్దీటి యహాను కార్యక్రమ వాల్‌పోస్టరును ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. తమ సంస్థ ఐఎస్ఓ గుర్తింపును పొందినట్టు గుర్తుచేశారు. 28వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఏర్పాటయ్యే సభలో సాంస్కృతిక అంశాల ప్రదర్శన, ప్రముఖులకు మహాకవి జాషువా పురస్కారాల ప్రదానం ఉంటాయని తెలిపారు. పోస్టరు ఆవిష్కరణలో పరిషత్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రంగిశెట్టి రమేష్, డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్ పాల్గొన్నారు.



గుర్రం జాషువా విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన ప్రముఖులు

జాషువా సేవలు మరువరానివి

తెనాలిఅర్బన్: తెలుగు భాషకు, సాహిత్యానికి గుర్రం జాషువా చేసిన సేవలు మరపురానివని జైభీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు కటివరపు దేవయ్య, రాష్ట్ర కార్యదర్శి యంగ్రపాటి అశోక్ కుమార్‌లు కొనియాడారు. జాషువా 53వ వర్ధంతిని జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో జన్మించిన జాషువా బడుగు, బలహీన వర్గాల జీవిత వ్యధలను తన సాహిత్యం ద్వారా తెలియజేశారన్నారు. పేదవారి జీవన గమనంలోని చీకటిని ఛేదించి అక్షర విజ్ఞాన వెలుగును నింపిన వెలుగు దివ్వె జాషువా అని పేర్కొన్నారు. పెట్టుబడి, పెత్తందారీ భూస్వామ్య విధానాలను ఆయన ఎండగట్టే వారన్నారు. జాషువా రచించిన సత్యహరిశ్చంద్ర నాటికలోని కాటిసీను పాత్రలోని పద్యాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని చెప్పారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది సుద్దపల్లి మురళీ, సుద్దపల్లి శరత్ వెంకయ్య, వర్మ, అశోక్, ప్రేమ్ కుమార్, కె రామారావు తదితరులు పాల్గొన్నారు.

● అలనాటి సమాజంలో సామాజిక అసమానతలను కులవివక్ష వంటి రుగ్మతలను గుర్రం జాషువా తన కవితలతో చికిత్స చేశారని తెనాలి పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. జాషువా 53వ వర్ధంతిని కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్న కులంలో జన్మించటం వల్ల ఆయన అనేక అవమానాలు ఎదుర్కొన్నారని, తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ముధాచారాలపై తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. దోపిడీ లేని సమాజం కోసం మనం పోరాడినప్పుడే జాషువాకు నిజమైన నివాళులర్పించినట్లు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శి ఎం.రామకృష్ణయ్య, సూర్య ప్రకాశరావు, నాయకులు సాగర్, హృదయరాజు, హరిప్రసాద్, రవి, లక్ష్మణరావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టరు ఆవిష్కరించిన యోహాను



జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దేవయ్య, అశోక్ కుమార్



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

గ్రంథాలయ సేవానిరతుల కృషిఫలితమే ప్రజాచైతన్యం

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య జయంతి, 'కళాప్రపూర్ణ' పాతూరి నాగభూషణం వర్ధంతిని నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి అయ్యంకి, పాతూరి మహాశయులు గ్రంథాలయ రంగానికి చేసిన చిరస్మరణీయమని చెప్పారు. ఆంధ్ర దేశాన్ని చైతన్యం చేసిన ఉద్యమాల్లో గ్రంథాలయోద్యమం ప్రథమమని గుర్తుచేశారు. వయోజన విద్యావ్యాప్తికి వారు చేసిన కృషి, కార్యదీక్ష ఫలితంగా రాష్ట్రంలో అనేక గ్రంథాలయాల స్థాపనకు దారితీసిందన్నారు. 'ఆంధ్ర భారతీ తీర్థ' సంపాదకుడు అయ్యంకి వెంకట రమణయ్య తన కృషికి గాను 'గ్రంథాలయోద్ధారక', 'గ్రంథాలయ శాస్త్ర విశారద' బిరుదులు కూడా పొందారని తెలిపారు. పాతూరి నాగభూషణం గ్రంథాలయోద్యమంతోపాటు స్వాతంత్ర్య ఉద్యమంలోనూ పాల్గొన్నారని చెప్పారు. బోటు గ్రంథాలయాలను నడిపిన ఘనత ఆయనదేనని ప్పారు. గ్రంథాలయ శాస్త్రానికి సంబంధించి గ్రంథాలయశాస్త్ర విద్యార్థుల కోసం తెలుగులో గ్రంథాలను రచించారని చెబుతూ, తాను ఆయన శిష్యురాలిని కావటం అదృష్టమన్నారు. ఆయన నుండి క్రమశిక్షణ, సమయపాలన, వృత్తిలో నిబద్ధత, సేవానిరతిని అలవరచుకున్నట్టు చెప్పారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. తొలుత ఇద్దరి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు.



అయ్యంకి, పాతూరి చిత్రపటాలకు పుష్పాంజలి

వరి విత్తనాలు సరఫరా చేయాలి

తెనాలి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు వ్యవసాయశాఖ వరి విత్తనాలను సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లును కోరారు. వర్షపునీరు నిలిచిన పంట చేల పరిశీలనకు బుధవారం తెనాలి రూరల్ మండలంలో పర్యటించిన జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లును రైతుసంఘం నేతలు, వివిధ గ్రామాల రైతులు కలిశారు. వరి విత్తనాలను 90 శాతం సబ్సిడీతో సరఫరా చేయాలని కోరగా, అయిదు శాతం రాయితీతో కూడిన విత్తనాలను మాత్రమే అందించగలమని వెంకటేశ్వర్లు చెప్పారు. కొద్దిగా సొంతపొలం ఉండి కౌలుకు చేసుకుంటున్న రైతుల వివరాలను సేకరించాలనీ, జేఎల్‌జీ గ్రూపులు ఏర్పాటుచేయాలని, ప్రతి వ్యవసాయశాఖ, ఆర్‌బీకే ఉద్యోగులు కనీసం 10 గ్రూపులు ఏర్పాటుచేసి, బ్యాంకర్ల నుంచి రుణాలను ఇప్పించాలని కోరారు. వీరితో రైతులు వేజెండ్ల రోశయ్య, మహబూబ్‌ఖాన్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వివిధ రంగాల ప్రముఖులకు సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన వేజళ్ల వెంకట సుబ్బారావు మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గాంధీనగర్‌లో వెంకట సుబ్బారావు 10వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వేజళ్ల నవ్య రూపొందించిన 'మా స్ఫూర్తి ప్రదాత' బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

విద్య, సాహితీ, కళ, సామాజిక రంగాల్లో సేవలు అందిస్తున్న టి.శివప్రసాద్, ఎం.శ్యామ్‌ప్రసాద్, కె.శివరామకృష్ణ, బెల్లంకొండ వెంకట్, కటకం వెంకట ప్రసాద్, మువ్వా వెంకటేశ్వరరావు, రావి సుబ్బారావును సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత రెవిన్యూ ఉద్యోగి పిచ్చేశ్వరరావు తన ప్రసంగంలో వెంకట సుబ్బారావుతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ట్రస్టు వ్యవస్థాపకుడు వేజళ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ తన తండ్రి వెంకట సుబ్బారావు పట్టణంలోని కేఎస్ మున్సిపల్ హైస్కూలులో సరస్వతి మందిరం, ఎన్‌సీఆర్ హైస్కూలులో మంచినీటి వసతిని ఏర్పాటు చేయటంతోపాటు ప్రతిభావంతులకు పారితోషికాలు, పేదవిద్యార్థులకు యూనిఫాం అందించినట్టు చెప్పారు. ఆయన పేరిట బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాలను నిర్మించినట్టు చెబుతూ ప్రస్తుతం ఆ పాఠశాల మున్సిపాలిటీ నిర్వహణలో ఉన్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, అలపర్తి వెంకటేశ్వరరావు, శివప్రసాద్, భాస్కర్, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



సత్కార గ్రహీతలతో ట్రస్ట్ నిర్వాహకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్యురాలు శాంతి సూచించారు. మండల కేంద్రంలోని సచివాలయం–1 ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 189 మందికి పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా శాంతి గర్భిణులు, బాలింతలకు సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. మురుగు నీరు పారుదల సక్రమంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు కడుగుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఏఎన్ఎం లావణ్య, పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం చేకూరుతాయని సమగ్ర శిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి తెలిపారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జాతీయ నూతన విద్యా విధానం(ఎన్ఈపీ) అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా సమగ్ర శిక్ష విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా బుధవారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసింను అభినందించారు.

రేవేంద్రపాడు జెడ్పీ స్కూల్ పరిశీలన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెనాలి డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి కె.పద్మావతి సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో పరిశుభ్రత విషయంలోను, తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్ఎం డి.సుధామాధురి ఆదేశించారు. 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్నారా? భోజనం ఏ విధంగా ఉంది తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. ఆమె దుగ్గిరాల ఎంపీడీఓ బి.భార్గవి, ఎంఈఓ కె.శ్రీనివాసరావు ఉన్నారు.



విద్యార్థినులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న అభివృద్ధి అధికారి పద్మావతి

ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభం

రిజర్వేషన్ మంగళగిరి.. బస్సు విజయవాడలో..

మంగళగిరి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆన్‌లైన్ రిజర్వేషన్ కౌంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం నాయక్ మాట్లాడుతూ కరోనా సమయంలో నిలిపివేసిన కౌంటర్‌ను తిరిగి ప్రారంభించినట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు రిజర్వేషన్ కౌంటర్ పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం, బెంగళూరు నగరాలతో పాటు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని వివరించారు. ప్రయాణికులంతా రిజర్వేషన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. అయితే రిజర్వేషన్ కౌంటర్ ఇక్కడ అయినప్పటికీ బస్సు మాత్రం విజయవాడ బస్టాండ్‌లో ఎక్కాలని అధికారులు సూచించడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

సబ్సిడీల తగ్గింపుతో పెరగనున్న ఎరువుల ధరలు

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

తెనాలి: 2024–25 కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీ తగ్గింపులు చేయటం దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం ఎరువులకు పెద్ద ఎత్తున కేటాయింపులు తగ్గించడం, పంటల బీమా, పీఎం కిసాన్ వంటి పథకాలకు సబ్సిడీలు, నిధులు ఇవ్వకుండా ఏవిధంగా పంటల ఉత్పాదకత పెరుగుతుందని ప్రశ్నించారు. కనీస మద్దతు ధరలను గ్యారెంటీ చూస్తూ చట్టబద్ధత కల్పించాలన్న రైతుల ఆందోళనను కేంద్రప్రభుత్వం పరిశీలనలోకి తీసుకోకపోవటం శోచనీయమన్నారు. పంటల బీమాకు గత ఏడాదికంటే రూ.400 కోట్లు, రైతురుణాలపై వడ్డీ రాయితీకి రూ.22,600 కోట్లు తగ్గించారని తెలిపారు. ఎరువులపై సబ్సిడీలు తగ్గించటం వల్ల డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరుగుతాయని చెబుతూ రైతు చేతిలో ఉన్న వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేయటం దుర్మార్గమన్నారు. డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ సిఫార్సులను వదిలేశారని విమర్శించారు.

టీచ్‌టూల్ శిక్షణతో మెరుగైన ఫలితాలు

జిల్లా విద్యాశాఖాధికారిణి శైలజ

తెనాలిఅర్బన్: టీచ్ టూల్ శిక్షణతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారిణి శైలజ పేర్కొన్నారు. తెనాలిలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీచ్ టూల్ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. అనంతరం కొత్తపేటలోని రావిసాంబయ్య మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న క్రీడ ఉత్సవాలను ఆమె పరిశీలించారు. క్రీడల పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట మండల విద్యాధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతి బాబు, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారిణి శైలజ

పౌష్టికాహారం పంపిణీ చేసిన రోటరీ క్లబ్

తెనాలి: మాతాశిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పట్టణ మారీసుపేటలోని అర్బన్ హెల్త్ సెంటరులో 30 మందికి రూ.15 వేల విలువైన పౌష్టికాహారాన్ని అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ క్లబ్ తరఫున మాతాశిశు సంరక్షణలో భాగంగా ఈరోజు 30 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశామని, మరో పదిరోజుల్లో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అదేవిధంగా రక్తదాన శిబిరం నిర్వహించి, సేకరించిన రక్తపు యూనిట్లను ప్రభుత్వ ఆసుపత్రికి అందజేస్తామని తెలిపారు. రొటేరియన్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ భద్రాచలం సమీపంలోని వీఆర్ మండలంలోని పోలవరం ముంపు బాధితులకు టార్పాలిన్లు, దోమతెరలు అందించనున్నామని వెల్లడించారు. రోటరీ కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ మాట్లాడుతూ అందరి సహకారంతోనే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రొటేరియన్లు గుత్తా వెంకటరత్నం, డాక్టర్ డి.జీవనలత, పావులూరి రాంబాబు, జీవీ నారాయణ, ఉపేంద్ర, హరి, నరేంద్ర, సుభాని, సుబ్రహ్మణ్యం, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ వి.దేవికవాణి, ఎం.వాణి, 25, 26, 27, 28, 38 వార్డుల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పౌష్టికాహారం బ్యాగులను అందిస్తున్న ఈదర శ్రీనివాసరావు

ప్రభుత్వాస్పత్రిలో చోరీలకు పాల్పడుతున్న బాలిక

పోలీసులకు అప్పగించిన భద్రతా సిబ్బంది

తెనాలిరూరల్: జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఓ బాలిక చోరీలకు పాల్పడుతోంది. బాలికను గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది ఆమెను పట్టుకుని పోలీసులకు బుధవారం అప్పగించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో గత కొంత కాలంగా చోరీలు జరుగుతున్నాయి. రోగులు, రోగుల సహాయకులకు చెందిన నగదు, నగలు, హ్యాండ్‌బ్యాగులు మాయమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వైద్యశాలలో రక్త నమూనాలు సేకరించే మహిళ బ్యాగులో ఉన్న నల్లపూసల దండ మాయమైంది. చోరీల విషయం తెలుసుకున్న వైద్యశాల సూపరింటెండెంట్, అధికారులు వైద్యశాలలో ప్రైవేటు ఏజెన్సీ కింద ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రక్తనమూనాలు సేకరించే మహిళ బ్యాగు ఉన్న ప్రదేశానికి సమీపంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీను పరిశీలించగా ఓ బాలిక గొలుసు అపహరించినట్టు గుర్తించారు. వైద్యశాలలో ఉన్న రోగులకు సహాయకురాలిగా వైద్యశాలలో సంచరిస్తూ అందినకాడికి దోచుకుంటోందని సెక్యూరిటీ సిబ్బంది తెలుసుకున్నారు. వైద్యశాల ఓపీ విభాగం వద్ద బుధవారం ఉదయం సదరు బాలిక సంచరిస్తుండగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ఆమెను పట్టుకుని త్రీ టౌన్ పోలీసులకు అప్పగించారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన బాలిక, కుటుంబసభ్యులు కొంతకాలంగా తెనాలిలో నివసిస్తున్నారని, వైద్యశాలలో చోరీలకు అలవాటు పడిందని పోలీసు వర్గాలు తెలిపాయి. వైద్యశాలలో అపహరించిన నల్లపూసల దండను కడపలో ఓ మహిళ వద్ద ఉంచానని బాలిక పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. బాలిక ఒక్కతే చోరీలకు పాల్పడుతోందా? లేక ఆమెతో పాటు మరింత మంది వైద్యశాలకు వచ్చి చోరీలు చేస్తున్నారా అన్న అంశాలను పరిశీలిస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించండి

మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె హెలెన్ నిర్మల

తెనాలిఅర్బన్: వ్యాధుల పట్ల ప్రజలందరికీ అవగాహన కల్పించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె హెలెన్ నిర్మల, స్పెషల్ ఆఫీసర్ అంగలకుదురు గాయత్రిదేవిలు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని హెల్త్ సెక్షన్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అలాగే దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ఎద్దైన వ్యాధి సంభవించిన వెంటనే వైద్యశాలకు వారిని పంపే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్ పుష్పలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, శానిటేషన్ సెక్రెటరీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె హెలెన్ నిర్మల

నోట్ పుస్తకాలు, జామెంట్రీ బాక్స్‌లు పంపిణీ

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మారుతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్ పుస్తకాలు, జామెంట్రీ కిట్స్, పెన్నులు, పెన్సిళ్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఈఓ ఓ.శాంతకుమారి, ఎంఈఓ నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరాంజనేయులు, నాయకులు లింగంశెట్టి కిషోర్ కుమార్, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు రాజారమేష్, దొప్పలపూడి జ్యోతి బసు, గాదె వినయ్, వంగా నరేంద్ర, సనక బుచ్చిబాబు, కూనపరెడ్డి రమేష్, భార్గవ్, బొబ్బా రామారావు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు, జామెంట్రీ కిట్స్ అందజేస్తున్న దృశ్యం

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఫిరంగిపురం: అప్పుల బాధతో ఉరివేసుకొని చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కండ్రిక గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కండ్రిక గ్రామానికి చెందిన తెనాలి ప్రేమ్‌కుమార్ (31) అత్తగారి ఊరైన మేడికొండూరు మండలం మందపాడులో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మిరప పంట సాగుచేశాడు. సరిగా పండకపోవడంతో అప్పుల పాలయ్యాడు. కొద్ది నెలల కిందట ఫైనాన్స్‌లో ఆటో తీసుకొని బాడిగ తోలుకుంటున్నాడు. కాగా సరైన ఆదాయం రాక అప్పులు తీర్చలేక తెల్లవారుజామున ఇంట్లోని గదిలో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటికి గమనించిన అతడి భార్య ఇంట్లోని కుటుంబ సభ్యులను నిద్రలేపి భర్తను చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. భార్య శాంతిప్రియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సదాశివరావు తెలిపారు.